క్లుప్తంగా

పొలంలో ఒరిగిన విద్యుత్ స్తంభం



పొలంలోకి ఒరిగిన స్తంభం

ధారూరు: ధారూరు మండలం ధర్మాపూర్ నుంచి పీలారం గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం పంట పొలంలోకి ఒరిగిపోయింది. అలా ఒరిగి రెండు వారాలు గడుస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. స్తంభం నుంచి కనెక్షన్‌ను తొలగించిన వైర్లు.. కిందకు వేలాడుతుండటంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి, పోల్‌ను సరి చేసి కనెక్షన్ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

ఎక్కడున్నా ప్రజాదరణ పొందాలి



ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను సన్మానించిన ఎంపీపీ తదితరులు

ధారూరు: బదిలీ, పదోన్నతులు సాధారణమని, ఎక్కడికి వెళ్లినా అక్కడి ప్రజల ఆదరణ పొందాలని ధారూరు ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. జనగామ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను సోమవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. మంచి పనులు చేసిన అధికారులను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని చెప్పారు. ఎంపీడీఓగా చంద్రశేఖర్ సేవలను కొనియాడారు.

మూగజీవులకు సేవ చేస్తున్నం.. ఆదుకోండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

వికారాబాద్ అర్బన్: 18 సంవత్సరాలుగా పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని జిల్లాకు చెందిన 38 మంది ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మంత్రి మహేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వీఆర్ఏలను తమ స్థానంలో భర్తీ చేశారని, ఈ కారణంగా ఇంతకాలం నుంచి పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో గ్రామీణ ప్రాంతాల్లో మూగజీవాలకు సేవ చేస్తున్న తమను ఆదుకోవాలని కోరారు.

నాచు తొలగింపు



ముళ్ల కొమ్మలతో నాచు తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

బంట్వారం: కోట్‌పల్లి మండలం మల్‌శెట్టిపల్లి తండా వాగు సీసీబెడ్‌పై నాచు పేరుకుపోవటంతో వాహన దారులు జారి కింద పడుతున్నారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ చంద్రకళ సోమవారం నాచు తొలగింపు ప్రక్రియ చేపట్టారు. పంచాయతీ కార్మికులతో ట్రాక్టర్‌కు ముళ్ల చెట్టు కొమ్మలు కట్టి, నాచును తొలగింపజేశారు. దీంతో తండావాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

చతుర్విధ ప్రక్రియలు నేర్పించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

పూడూరు: ప్రతి విద్యార్థికి చతుర్విధ ప్రక్రియలు నేర్పించాలి అని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. సోమవారం కంకల్ కాంప్లెక్స్ పరిధి నిజాంపేట్ మేడిపల్లి, చింతలపల్లి పాఠశాలలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలపై ప్రతి ఒక్కరికీ భరోసా కల్పించేలా బోధన ఉండాలని చెప్పారు. బేస్‌లైన్, ఎస్ఈఎఎస్ పరీక్షల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. నాణ్యమైన భోజనంతో పాటు రాగిజావ అందిస్తున్నారా అని వంటశాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో నజీమోద్దీన్, వంశీధర్‌రెడ్డి, రాజశేఖర్, విష్ణువర్ధన్, యాదయ్య ఉన్నాయరు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

- భయపెడుతున్న డెంగీ, మలేరియా
- సిజనల్ వ్యాధుల బారిన పడుతున్న చిన్నారులు
- రోగులతో నిండిపోయిన ఆసుపత్రులు
- అపరిశుభ్రతతో అల్లాడుతున్న పుర ప్రజలు
- అధికారికంగా మూడు డెంగీ కేసులు

జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్లతో ప్రజలు హడలిపోతున్నారు. వరుస వర్షాలు, ఇంటి పరిసరాల అపరిశుభ్రత, ఇళ్లమధ్యే పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు జలాలతో రోగాలు ముప్పేట దాడిచేస్తుండగా.. మంచినీటి నిల్వతో పగటి దోమల దాడి పెరిగిపోయింది. దీంతో డెంగీ, తదితర విషజ్వరాల బారిన పడిన బాధితులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో హాస్పిటల్స్, పుర ప్రాంతాలను 'సాక్షి' విజిట్ చేయగా.. ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్న అనేక అంశాలు వెలుగుచూశాయి.



మధు కాలనీలో ఇళ్ల మధ్య పేరుకుపోయిన వ్యర్థ జలాలు

వికారాబాద్ అర్బన్: వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. విరామం లేకుండా కురుస్తున్న వర్షాలు, దానికి తోడు పారిశుద్ధ్య లోపం వలన పెరుగుతున్న దోమలతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడింది. డెంగీ, డయేరియా, మలేరియా తదితర వైరల్ ఫీవర్‌తో అధికులు ఆసుపత్రి పాలవుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్ రోగులతో కిక్కిరిసిపోగా.. రానున్న రోజుల్లో వ్యాధుల దాడి మరింత పెరగనుందని వైద్య నిపుణులు పేర్కొనడం ఆందోళన కలిగిస్తోంది. సోమవారం వికారాబాద్ ఏరియా ఆసుపత్రిలో ఓపీ విభాగం రోగులతో నిండిపోయింది. పేరు నమోదుకు జనం బారులు తీరారు. దాదాపు 600 నుంచి 700 మంది వరకు వైద్యం కోసం తరలివచ్చారు. అయితే ఇందులో సుమారు నాలుగు వందల మంది వరకు దగ్గు, జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులతో వచ్చిన వారే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా.. విష జ్వర పీడితులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తుండటంతో వైద్య ఆరోగ్యశాఖ వద్ద లెక్కలు లేకుండా పోయాయి. జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 32 డెంగీ కేసులు నమోదు కాగా.. ఈ నెలలో ఏడు కేసులు నమోదు అయినట్లు వైద్యాధికారులు చెప్పారు. అయితే అధికారులు చెబుతున్న ఈ లెక్కలు కేవలం ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించిన బాధితుల సంఖ్య మాత్రమే. వందల కొద్ది డెంగీ బాధితులు ప్రైవేటు హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతున్నారు.

మున్సిపాలిటీలో మూడు

జిల్లా కేంద్రంలోని మధు కాలనీ రాజీవ్ గృహకల్ప ఆలంపల్లి, శివరాం నగర్, ఇంద్రానగర్, రిక్షా కాలనీ, గంగారం తదితర కాలనీల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఎన్నెపల్లిలో ఒకటి, రమయ్య గూడలో ఒకటి, శివరాంనగర్‌లో మరొకటి డెంగీ కేసులు నమోదయ్యాయి. మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు నమోదు కావడం లేదని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ.. సాధారణ జ్వరాలతో మాత్రం ప్రజలు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

ఇంటి చుట్టూ మురుగే



ఇంటి చుట్టూ మురుగునీరు చేరింది. ఇంట్లోంచి బయటకు రావడానికి అవకాశం లేదు. మోకాళ్ల లోతులో నీరు నిలుస్తోంది. ఎక్కువ రోజులు నిలువ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. మధు కాలనీలో వాటి దాడితో పిల్లలు, పెద్దలు అనారోగ్యం పాలవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి, తక్షణ చర్యలు చేపట్టాలి.

– ముదాసీర్, మధుకాలనీ వాసి

ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



అడుగు బయటకు పెట్టాలంటే భయంగా ఉంది. మురుగు నీటిలోంచే నడవాలి. డ్రైనేజీ ఇంటి ఎదుట నుంచి ప్రవహిస్తుండటంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. పగలు, రాత్రి దోమలు కుడుతున్నాయి. పిల్లలను బయటకు వదలాలన్నా భయమేస్తోంది. గత్యంతరం లేక ఈ మురుగునీటిలోనే కాలం వెళ్లదీస్తున్నాం.

– శ్యామల, గృహకల్ప వాసి

ప్రజారోగ్యంపై శ్రద్ధ చూపని అధికారులు!



చెత్తతో నిండిన బీట్ మార్కెట్

ఇళ్ల మధ్యే పేరుకుపోయిన మురుగు జలాలతో దోమల బెడద అధికమైంది. మురుగునీరు నిల్వ ఉన్న కాలనీవాసులే ఎక్కువగా జ్వరాల బారిన పడుతున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలంటూ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అయినప్పటికీ.. సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ అధికారులు ప్రజారోగ్యంపై శ్రద్ధ చూపలేదన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రం ప్రధాన రోడ్లలో మురుగు రోడ్లపై పారుతున్నా, నిత్యం వందలాది మంది వచ్చే సంతలో పెద్దఎత్తున వ్యర్థాలు పేరుకుపోయినా సంబంధిత సిబ్బంది పట్టించుకోవటం లేదని, దీనితో అక్కడికి వచ్చే క్రయవిక్రయదారులు దోమ కాటు, ఇతర విష జ్వర పీడితులుగా మారుతున్నట్లు తెలుస్తోంది.

చిన్నారులపై ప్రభావం..



పిల్లల చికిత్స కోసం వరుసలో నిలబడిన పెద్దలు

జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో జ్వర బాధితులు చికిత్స పొందుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రధానంగా చిన్నపిల్లలపై ప్రభావం చూపుతున్నాయి. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వస్తున్న వారిలో చిన్నపిల్లల సంఖ్య అధికంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రధానంగా శివారుప్రాంతాలైన కొత్రేపల్లి, మద్గుల్ చిట్టంపల్లి, బూరుగుపల్లి, గుడిపల్లి, ధన్నారం వంటి వార్డుల్లో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ముసురుతున్నట్లు తెలుస్తోంది.

ఆంగ్లంను అనర్గళంగా..

బొంరాస్‌పేట: ఆంగ్ల భాషను ఉన్నత పాఠశాల స్థాయి నుంచే ధారాళంగా చదవడం, రాయడం నేర్చుకొని అనర్గళంగా మాట్లాడుదామని తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ) రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధి బొట్లోనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో యూత్ ఫర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థినులకు ఆంగ్ల నిఘంటువులు ఉచితంగా అందజేసి మాట్లాడారు. మాతృభాషతో పాటు ప్రపంచభాష ఆంగ్లాన్ని నేర్చుకోవాలని సూచించారు. ఇందులో హెచ్ఎం ప్రతాప్‌సింగ్, ఉపాధ్యాయబృందం శరణప్ప, సురేశ్, రాజన్న, అనురాధ ఉన్నారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన మాసయ్య యాదవ్ మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్ స్థానిక నేతలతో సోమవారం బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5వేలు అందజేశారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు మాసయ్య ముదిరాజ్, నరేష్, రామస్వామి, రవి, గోరేపాష ఉన్నారు.

'ఆశ'ల సమస్యలు పరిష్కరించండి

దోమ: ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశలు నిరవధిక సమ్మెను చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.18వేల వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో పదోన్నతి కల్పించాలని, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ కింద రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు.

చీకటి పడే లోపు ముగించాలి

మోమిన్‌పేట: వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ విఠల్‌రెడ్డి ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం ఉదయం వినాయ మండపాల వద్ద పూజలు నిర్వహించి, మధ్యాహ్నం నుంచి విగ్రహాల ఊరేగింపు ప్రారంభించాలని చెప్పారు. చీకటి పడే లోపు నందివాగు ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన ప్రదేశంలో నిమజ్జనం ముగించాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, భజనలు చేస్తూ సాగలన్నారు.

పోలీసు చట్టాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీశైలం

కుల్కచర్ల: పోలీసు చట్టాలపై ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఎస్ఐ శ్రీశైలం అన్నారు. సోమవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో పోలీసు చట్టాలు, సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆపదలో 100కు డయల్ చేసి పోలీసుల సహకారం పొందవచ్చని, 181కి ఫోన్ చేయడం ద్వారా షీటీం అండగా నిలుస్తుందని చెప్పారు. సీసీ కెమెరాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణ, బ్యాంకింగ్ మోసాలు, మత్తు పదార్థాల నిర్మూలన, సైబర్ క్రైం 1930పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఇందులో పాఠశాల ప్రత్యేక అధికారి బాలవరలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

రుణం చెల్లించని వారిపై చర్యలు తప్పవు

ఏపీఎం బాలయ్య

పెద్దేముల్: మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను వెంటనే చెల్లించాలని ఏపీఎం బాలయ్య అన్నారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో వెయ్యి మహిళా సంఘాలకు ప్రభుత్వం ద్వాక్ర రుణాలు ఇవ్వగా, అందులో 86 సంఘాల సభ్యులు సక్రమంగా రుణాలు చెల్లించడం లేదన్నారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినా ఎటువంటి మార్పు రావడం లేదని, అలాంటి సంఘాలపై బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ 86 సంఘాల సభ్యులు సుమారు రూ.2కోట్ల 19లక్షలు చెల్లించ వలసి ఉందని ఏపీఎం తెలిపారు. ఇప్పటికైనా రుణాలు సకాలంలో చెల్లించి, సంఘం అభివృద్ధికి పాటుపడాలని కోరారు. లేని యెడలా తగిన తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ సంతోష్, మహిళా సమాఖ్య సభ్యులు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను ఇబ్బంది పెట్టేందుకు యత్నం

- పారామెడికల్ సిబ్బందిని తొలగించడమే 142 జీఓ లక్ష్యం
- జీఓను తక్షణమే రద్దుచేయాలి
- రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు చంద్రప్రకాష్ డిమాండ్



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

వికారాబాద్ అర్బన్: వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు తీవ్రంగా నష్టం కలిగించే జీఓ 142ను ప్రభుత్వం రద్దు చేయాలని రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు చంద్రప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం 200మంది ఆరోగ్య సిబ్బందితో కలెక్టరేట్‌తో పాటు డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న పారామెడికల్ సిబ్బందిని తొలగించడమే జీఓ ఉద్దేశమని, గతంలో తీసుకు వచ్చిన 317 జీఓతోనే చాలా మంది ఉద్యోగులు ఇబ్బందులకు గురైనట్లు ఆయన వెల్లడించారు. 142 జీఓతో ఉద్యోగులను ప్రభుత్వం ఇబ్బంది పెట్టేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. జీఓ అమలైతే జిల్లా ఉప వైద్యాధికారి కార్యాలయం మూసివేస్తారని, పీపీ యూనిట్ల రద్దు, మలేరియా విభాగం పోస్టులతో పాటు క్షయ, కుష్టు నివారణ కార్యక్రమంలోని పోస్టులను రద్దు చేస్తారని పేర్కొన్నారు. జోన్ స్థాయి పోస్టులను జిల్లా స్థాయికి మార్చడంతో పాటు 4,266 పోస్టులు రద్దు అవుతాయన్నారు. నిరసనలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ సాయిబాబ, డాక్టర్ రవీంద్ర యాదవ్, చంద్రశేఖర్, రేణు కుమార్, శ్రీనివాస్, శివ కుమార్, జంగయ్య, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాపై చిన్నచూపు తగదు



తాండూరు టౌన్: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

- ఇతర ఉద్యోగుల్లాగే ఆదరించండి
- క్రమబద్ధీకరించి ఆదుకోండి: అంగన్‌వాడీలు

తాండూరు టౌన్: తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేస్తున్న సమ్మె సోమవారం నాటికి 15 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు నల్లటి దుస్తులు ధరించి, నిరసన తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వరకు ర్యాలీ తీసి, రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలకు చెందిన ఉద్యోగులను ఒకే విధంగా చూడటం లేదని ఆరోపించారు. ఇతర శాఖ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన ప్రభుత్వం.. అంగన్‌వాడీల పట్ల చిన్నచూపు చూడటం సరైంది కాదని హితవు పలికారు. వెంటనే తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ. 26,500 చెల్లించడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని యెడలా ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఇందులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, అంగన్‌వాడీలు బేబి, సుధారాణి, శశికళ, బాలమణి, హారతి, చంద్రకళ, తిరుమలమ్మ, నర్సమ్మ, భారతి, విజయలక్ష్మి ఉన్నారు.

స్పందించే వరకు పోరాటం..

పరిగి: ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తూనే ఉంటామని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో చేపట్టిన నిరసనలో పలువురు మాట్లాడారు. ప్రభుత్వం.. అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

సమాన పనికి..

కొడంగల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఆ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. ఇందులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, అంగన్‌వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు రెహనాబేగం, కార్యదర్శి నవనీత, ఉపాధ్యక్షురాలు శివలీల, టీచర్లు వెంకటమ్మ, రత్నాబాయి, జయమ్మ, వినోద తదితరులు పాల్గొన్నారు.

త్వరలో రైతులకు ఉచితంగా ఎరువులు

ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న రవిగౌడ్

తాండూరు రూరల్: రైతులకు త్వరలో ఉచితంగా ఎరువులు అందజేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ భావిస్తున్నారని ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ సంగెం రవిగౌడ్ అన్నారు. సోమవారం జరిగిన ఎల్మకన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో ఎల్మకన్నె సొసైటీని ఎంపిక చేశారని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం రైతులకు ప్రైవేట్ కంపెనీల ద్వారా సొసైటీని ఎంపిక చేసి, రైతులకు ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఆ తర్వాత పొలాల వద్దకు వెళ్లి మార్కెట్ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తారని చెప్పారు. సొసైటీ కింద 556 రైతులకు రూ.2కోట్ల 20లక్షలు రుణమాఫీ చేశామని తెలిపారు. సొసైటీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, డైరెక్టర్లు, సీఈఓ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

అనంతగిరి: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన ఐద్వా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే మహిళలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. వచ్చే నెల 5న నిర్వహించే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఇందులో మహిళా నాయకురాళ్లు అనసూయ, వీరమణి, భారతమ్మ, అమృతమ్మ, సునీత ఉన్నారు.

◆ కాంగ్రెస్‌కే ప్రజల మద్దతు

పెద్దేముల్: కాంగ్రెస్ పార్టీని మండల ప్రజలు ఆదరిస్తున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొండాపూరం గోపాల్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలం ఆత్కూర్, బండమీదిపల్లి గ్రామాల్లో గ్రామ కమిటీ, బూత్‌కమిటీలను ఏక గ్రీవంగా నియమించారు. అనంతరం మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తారని తెలిపారు. ఇందులో మాజీ సర్పంచ్‌లు మల్లప్ప, నాయకుడు రాములు ఉన్నారు.

◆ ప్రతి వార్డుకు రోడ్డు



తాండూరు: ప్రతి వార్డులో రోడ్లు, మురుగు కాల్వను నిర్మిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నారు. సోమవారం 10వ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ల రత్నమాల ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీపలు రూ.50 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులతో ప్రతివార్డులో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో మున్సిపల్ కౌన్సిలర్ ఆసిఫ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అప్పు, స్థానిక నాయకులు పట్లోళ్ల నర్సింహులు ఉన్నారు.

◆ భక్తిభావం ఉండాలి

అనంతగిరి: ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. సోమవారం వికారాబాద్ పట్టణం కొత్తగంజ్ హనుమాన్ మందిరంలోని మండపంలో కొలువుదీరిన వినాయకున్ని ఆయన దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం గ్రీన్ అండ్ సీడ్స్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ దీప, వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, పలువురు కౌన్సిలర్లు, మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు ఉన్నారు.

◆ ప్రొసిడింగ్ కాపీల అందజేత



అనంతగిరి: వికారాబాద్ నియోజకవర్గ పరిధి గ్రామాల అభివృద్ధికి రూ.2.11కోట్ల నిధుల మంజూరు ప్రొసిడింగ్ కాపీలను ఎమ్మెల్యే ఆనంద్ తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఇందులో పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

◆ మొక్కలు పెంచాలి

అనంతగిరి: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెంచాలని ఎంపీడీఓ సత్తయ్య అన్నారు. సోమవారం వికారాబాద్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, కంపోస్టు షెడ్ పరిసరాల్లో తప్పనిసరిగా మొక్కలు నాటి, ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో ఏపీఓ శ్రీను, ఎంపీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ 317 బాధితులకు న్యాయం చేయాలి

దోమ: జీఓ నంబర్ 317తో నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని టీపీయూఎస్(తపస్) మండల అధ్యక్షుడు రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ కారణంగా ఉపాధ్యాయులు స్థానికతను కోల్పోయి, ఇతర జిల్లాలకు బలవంతంగా బదిలీ అయి, మానసికంగా ఇబ్బంది పడ్డారని పేర్కొన్నారు. స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

◆ బదిలీకి అవకాశం ఇవ్వాలి..

పరిగి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని సంఘం నాయకులు అన్నారు. మండల పరిధి పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడారు. పీఆర్‌సీ కమిటీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 317 జీఓతో నష్టపోయిన ఉపాధ్యాయులకు వారి స్థానికతను బట్టి బదిలీకి అవకాశం ఇవ్వాలని కోరారు.

◆ గణపయ్యకు ఘనంగా పూజలు



పెద్దేముల్: ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో నిత్యపూజలందుకుంటున్న గణపయ్యను సోమవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌ను సన్మానించారు. ఇందులో నాయకులు రంగయ్య, ముదిరాజ్ సంఘం సభ్యులు ఉన్నారు.

అన్నదానం..

కుల్కచర్ల: చవితి నవరాత్రులు సందర్భంగా కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధి గ్రామాల్లో వెలసిన మండపాల్లో కొలువుదీరిన గణనాథులు.. భక్తుల నిత్యపూజలు అందుకుంటున్నారు. కుల్కచర్ల మండల కేంద్రం అంగడిబజార్ మండపం వద్ద భాగ్యమ్మ ఆంజనేయులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

◆ హరీశ్వర్‌రెడ్డి మృతికి సంతాపం



పరిగి: మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి మృతికి సంతాపంగా సోమవారం ఆయన అభిమానులు పట్టణ కేంద్రంలోని కొడంగల్ చౌరస్తా నుంచి బహార్‌పేట్ కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిగి అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, జెడ్పీటీసీ హరిప్రియ, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.